# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కొనసాగుతోన్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.**

2. **రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ వరుసగా రెండవ ఏడాది జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ .**

3. **రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ.**

4. **యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. ఈ సందర్భంగా రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మంత్రిమండలి చర్చిస్తోంది. అలాగే పరిపాలనా, అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలకు మంత్రి వర్గసమావేశంలో ఆమోదించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

-------------------------

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ వరుసగా రెండవ ఏడాది జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడం పట్ల ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె. పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాల సాధనలో భాగస్వాములైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో పాటు సర్పంచులు, వార్డు సభ్యులకు అభినందనలు తెలుపుతూ ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అవార్డులు గ్రామీణ స్థానిక సంస్థల పనితీరు, ప్రజాప్రతినిధుల నిబద్ధత, అధికారుల సమిష్టి కృషికి నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ గుర్తింపుతో మరింత ఉత్సాహంగా పనిచేసి గ్రామీణాభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాల సాధనకు దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో మొత్తం ఐదు అవార్డులు అందుకుంది.

-------------------------

రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో పర్యటించిన మంత్రి కొండవీటి వాగు అభివృద్ధి పనులను ఈరోజు పరిశీలించారు. అలాగే వాగుపై నిర్మిస్తున్న వంతెనల పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాజధానిలో ట్రంక్ రోడ్లు, వంతెనలు, వాగుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాజధాని ప్రాంతానికి నీటి లభ్యత కోసం చేపట్టిన శాఖమూరు, పెనుమాక, నీరుకొండ జలాశయాల నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తయ్యాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బీసీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, విద్యార్థులెవరూ చదువులకు దూరం కాకుండా ప్రవేశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హాస్టళ్లు, తరగతి గదులు, విశ్రాంతి గదులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు.

---------------------------

యువతకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరులో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రముఖ చలన చిత్ర నేపథ్య గాయకులు ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం జయంతి ఈరోజు... తెలుగుతో పాటు దక్షిణాది చలన చిత్ర ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4వ తేదీన అప్పటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కోనేటమ్మపేట గ్రామంలో జన్మించారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వేలాది పాటలు పాడారు. ఉత్తమ గాయకుడిగా ఆరుసార్లు జాతీయ అవార్డు, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ తో గౌరవించింది. తన గానంతో దశాబ్దాల పాటు ప్రజలను అలరించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 2020 సెప్టెంబర్ 25న 74ఏళ్ల వయసులో దివంగతులయ్యారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నివాళులర్పించారు. ఆయన పాడిన వేలాది పాటల రూపంలో ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం ఎప్పటికీ జీవించే ఉంటారని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పార్వతీపురంమన్యం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టి. భవాని శంకర్ రావు సూచించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో జిల్లాలో రుతుపవనాలకు ముందు పొడి విత్తనాలు నాటే-PMDS కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 20 రకాల విత్తనాలతో ప్రత్యేక -PMDS కిట్లను రైతులకు అందిస్తున్నామని వీటి ద్వారా రైతులు అంతర పంటల సాగును చేపట్టాలని సూచిస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆకాశవాణి 90వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విజయవాడలో రేపు “ఆకాశవాణి వాకథాన్” నిర్వహించనున్నామని ఆకాశవాణి విజయవాడ కార్యక్రమాల విభాగాధిపతి జి. దివ్య ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ వాకథాన్ రేపు ఉదయం 6 గంటల 30 నిమిషాలకు ఆకాశవాణి కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై డి–అడ్రస్ మాల్ వరకు జరుగుతుందని పేర్కొంటూ.. ఆకాశవాణి నినాదమైన “బహుజన హితాయ, బహుజన సుఖాయ” స్ఫూర్తితో, భారతీయ సంస్కృతి పరిరక్షణలో ఆకాశవాణి సాగించిన 90 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, ప్రజా ప్రసార రంగంలో ఆకాశవాణి అందించిన 90 ఏళ్ల సేవలను గుర్తు చేసే ఉద్దేశంతో ఈ వాకథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

కేరళంలో పర్యటిస్తున్న పర్యాటక, శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోవలంలో జరుగుతున్న గ్లోబల్ ట్రావెల్ మార్కెట్–2026 అవార్డుల కార్యక్రమంలో ఈరోజు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన ప్రతిష్టాత్మక “ఉత్తమ పర్యాటక ప్రోత్సాహక రాష్ట్రం“ అవార్డును మంత్రి అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రత్యేక పెవిలియన్ వద్ద ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పర్యాటక రంగం దేశంలోనే విశేష ప్రగతి సాధిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక రంగంలో గత ఏడాది రాష్ట్రం 48 శాతం వృద్ధి సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారులు, టూర్ ఆపరేటర్లు ముందుకు రావాలని ఆహ్వానించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సైన్స్ సెంటర్‌లో పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై నిర్వహిస్తున్న వివిధ పోటీలను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. రేపు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు, పర్యావరణ పరిరక్షణ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

=====================